క్లుప్తంగా

18 నుంచి అంగన్‌వాడీల్లో ఒంటిపూట బడులు

సిరిసిల్లకల్చరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు ఈనెల 18 నుంచి ఒంటిపూట నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తెలిపారు. ఆయాకేంద్రాల్లో లబ్ధిదారులందరికీ పోషకాహార సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి డ్రాప్ అవుట్ అయిన పిల్లలు, కిషోర బాలికలను తిరిగి కేంద్రాల్లో చేర్పించడం, ఇంటింటి సర్వేలు తదితర అనుబంధ కార్యక్రమాలన్నీ యథావిధిగా కొనసాగించాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలి



సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని హర్షించారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించే ఇళ్లసంఖ్యను స్పష్టం చేయాలన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలివ్వాలి..

మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. సీపీఐ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. ఆరునెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు అజ్జ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని బూర్గుపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి ఎంపీ బండి సంజయ్‌కుమార్ రూ.50 వేలు విరాళంగా అందించినట్లు బీజేపీ సీనియర్ నాయకుడు గంగిపల్లి స్వామికుమార్ శనివారం తెలిపారు. గ్రామంలో ముదిరాజ్ సంఘ నాయకులకు నగదు అందించినట్లు స్వామికుమార్ పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ఇందిరమ్మకాలనీ వాసులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ మహిళలకు ఉచితబస్సు సౌకర్యం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు

ముస్తాబాద్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత బాలికలు, బాలుర పాఠశాలల్లో సోమవారం నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు నోడల్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. మండలంలోని పది జెడ్పీ, మోడల్, ఎస్సీ గురుకుల, కస్తూర్బా విద్యాలయంతోపాటు రెండు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 537 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. హెచ్‌ఎం రవీందర్, ఎమ్మార్సీ ఉద్యోగులు ఉన్నారు.

వీర్నపల్లి: ఈనెల 18నుంచి మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పది పరీక్షలకు అన్నిఏర్పాట్లు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అన్నారు. మండలంలో మొత్తం 229 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ బస్టాండ్ వద్ద ఓ గుర్తుతెలియని కారు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తి(52) దుర్మరణం పాలయ్యాడు. ఈ మతిస్థిమితం లేని వ్యక్తి నిత్యం గొల్లపల్లి నుంచి గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ వరకు నడుచుకుంటూ వెళ్తుంటాడు. దారిలో ఎవరైనా అన్నం పెడితే తింటూ కాలం గడుపుతుంటాడు. ఈక్రమంలోనే శనివారం రాత్రి వర్షంలో నడుచుకుంటూ వెళ్తున్న ఈ వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. గుర్తుతెలియని కారు కోసం గాలిస్తున్నట్లు ఏఎస్ఐ కిషన్‌రావు తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లి మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బండలింగంపల్లికి చెందిన రామన్నపల్లి దేవయ్యకు తీవ్రగాయాలయ్యాయి. దేవయ్య ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళ్తుండగా రాగట్లపల్లి శివారులోకి చేరుకోగానే బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. చికిత్సకోసం 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓఆస్పత్రికి తరలించారు.

కలర్‌ఫుల్.. కర్టెన్

వివిధ డిజైన్లలో

ఇంటీరియర్ డెకరేషన్‌తో ఇంటి అలంకరణకు అన్నివర్గాల వారు ఆసక్తి కనబరుస్తున్నారు. మార్కెట్లో ఆధునిక మోడల్స్‌లో లభిస్తున్న కర్టెన్లు చూడగానే కలర్‌ఫుల్‌గా ఉంటూ.. ఇంటికి వచ్చే అతిథులను ఆకట్టుకుంటున్నాయి. కిటికీలు, డోర్లు, పెద్దసైజులో ఉండే హాళ్లలో పార్టీషన్స్‌కై కర్టెన్స్ వాడుతున్నారు. ఇక బార్, రెస్టారెంట్లు, ఫంక్షన్‌హాళ్లు, బాంకెట్‌హాళ్లు ఇలా అన్నిరకాల కమర్షియల్ ప్లాట్స్‌లో వీటిని ఇంటీరియర్ డెకరేషన్‌గా వినియోగిస్తున్నారు. పట్టణంలో ప్రస్తుతం అన్ని వెరైటీల్లో కలర్‌ఫుల్‌గా కర్టెన్స్ లభ్యమవుతున్నాయి. షో రూమ్స్, ఫుట్‌పాత్ స్టాల్స్‌తో పాటు ఆన్‌లైన్‌లో లెక్కకు మించిన డిజైన్లలో కర్టెన్లు దొరుకుతున్నాయి.

కర్టెన్స్ ట్రెండ్..

ప్రస్తుతం మార్కెట్లో కర్టెన్స్ ట్రెండ్ నడుస్తోంది,. హ్యాంగింగ్, పెల్‌మెట్స్, ప్యానెల్ పెయిర్, వాలెన్సెస్, షీర్, టాబ్‌టాప్, గ్లొబెట్ ప్లీట్, టైలరేడ్ ప్లీట్, ఐలెట్, పించ్‌ప్లీటెడ్, హీడింగ్, రాడ్‌పాకెట్, బాక్స్‌ప్లీటెడ్ వంటి మోడల్స్ అందుబాటులో ఉన్నాయి. కర్టెన్స్ క్వాలిటీన్ని, మోడల్స్ బట్టి ధరలు రూ.100 మొదలుకొని రూ.30,000 వరకు దొరుకుతున్నాయి. ఇళ్లు, కార్యాలయాలు, రెస్టారెంట్లు, సినిమా హాళ్లు, షాపింగ్‌మాల్స్, ఫంక్షన్‌హాళ్లు, బాంకెట్‌హాళ్లలో నీట్‌లుక్ అగుపించేందుకు మార్కెట్‌లో ఆధునిక మోడల్స్‌లో కర్టెన్స్ దొరుకుతున్నాయి. ఆన్‌లైన్‌లో లివింగ్, మెయిన్ హాల్స్‌లో కర్టెన్స్‌ను వేస్తే ఎలాంటి లుక్ వస్తుందో లైవ్ ఫొటోస్‌తో వివిధ కంపెనీలు మార్కెట్ చేస్తుండగా..కస్టమర్స్ వారివారి అభిరుచులకు తగ్గట్టుగా కొనుగోలు చేస్తున్నారు.







- ఇండ్లు, కార్యాలయాలు, షాపుల్లో వినియోగం
- కర్టెన్స్‌తో కలర్‌ఫుల్ డెకరేషన్
- ఆధునిక మోడల్స్‌లో లభ్యం
- కొనుగోలు చేసేందుకు ఆసక్తి

సిరిసిల్లటౌన్: ఆధునిక యుగంలో ప్రజలు అందమైన ఇంటికోసం అదిరేటి డెకరేషన్‌ను ఎంచుకుంటున్నారు. ఎంతమంచి ఇల్లు అయినా సరే డోర్స్, విండోస్, వెంటిలేటర్స్, ఆర్చీస్‌కు కర్టెన్లు తప్పనిసరిగా వినియోగిస్తున్నారు. అతి తక్కువ బడ్జెట్‌లోనే ఇంటిని అందంగా కనిపించేలా కర్టెన్లు ఉపయోగపడుతుండగా సంపన్నులు మొదలుకొని సామాన్యులు వరకు వీటిని ఇళ్లలో వినియోగిస్తున్నారు. ఇలా ఇంటీరియర్స్ డెకరేషన్స్‌లో ముఖ్యపాత్ర పోషిస్తూ.. అందరినీ ఆకట్టుకుంటున్న కర్టెన్స్‌పై సండేస్పెషల్..

కొలతలు బట్టి ఆన్‌లైన్ ద్వారా..

ఇంటిని అందంగా ఉంచుకునే వారు ఆధునిక మోడల్స్‌లో పరదాలు వినియోగిస్తున్నారు. ఇంటికి,, ఆఫీస్‌లు, రెస్టారెంట్లు, ఫంక్షన్‌హాల్స్, సినిమాహాల్స్ ఇలా అన్నింటా కర్టెన్స్ వినియోగం ఎంతో ఉపయోగంగా ఉంటున్నాయి. మార్కెట్‌లోకి వస్తున్న కొత్త రకం కర్టెన్స్‌ను డోర్లు, కిటీకీలు, హాళ్లలో వినియోగించడంతో ఇల్లు అందంగా ఉండటంతో పాటు చూసేవారికి అదిరేలా ఉంటుంది. రెడీమేడ్ యుగంలో ఇంటికి కావాల్సిన కిటికీలు, డోర్స్, ఆర్చీస్ ఇలా అన్నింటికీ కొలతలను బట్టి ఆన్‌లైన్ ద్వారా, ఆఫ్‌లైన్ ద్వారా కొనుక్కునే వీలుంది. ఎప్పటికప్పుడు కొత్తదనం కోరుకునే వారు కర్టెన్స్‌ను మారుస్తూ..వారి ఇంటికి కొత్తలుక్‌ను తీసుకొస్తున్నారు. కాటన్, మక్‌మల్, సింథటిక్, ఉలెన్, సిల్క్ ఇలా వివిధ రకాల్లో కర్టెన్స్ లభ్యమవుతున్నాయి. వాటికున్న షైనింగ్‌ను బట్టి హాళ్లు, డైనింగ్, బెడ్రూం, ఆఫీస్‌రూముల్లో వినియోగిస్తే బాగుంటుంది.

వెరైటీ మోడల్స్ అందుబాటులో..



ఆన్‌లైన్‌లో వెరైటీ మోడల్స్ కర్టెన్స్ ఉన్నాయి. కర్టెన్స్ వాడటంతో ఇంటీరియర్ డిజైన్లకు గ్రాండ్‌లుక్ వస్తుంది. ఏసీ హాల్‌లోకి బయటి నుంచి వేడిరాకుండా నిరోధించడం మూలంగా విద్యుత్ కూడా ఆదా అవుతుంది. ఆఫీస్ రూమ్ మోడీఫై చేయగా కర్టెన్స్ గుడ్‌లుక్ వచ్చింది.

–గుర్రం అంజయ్య, అడ్వకేట్

ధరలు సాధారణమే



ఇంటికి అందంగా ఉండే కర్టెన్స్ దుమ్ము, ఎండ, చలి నుంచి రక్షణ ఇస్తాయి. లేటెస్ట్ మోడల్స్‌లో కర్టెన్స్‌కు ధరలు కూడా సాధారణంగా ఉన్నాయి. వివిధ బొమ్మలతో ఉండే కర్టెన్స్ ఇంటికి అందాన్ని పెంచుతాయి. గుమ్మానికి సాధారణం, కిటికీలకు రోల్ అప్ డౌన్ కర్టెన్స్ వాడుతున్నాం.

– రామోజుల మమత, గృహిణి

సీఎంను కలిసిన చక్రధర్ రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న చక్రధర్‌రెడ్డి

ముస్తాబాద్: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు కోసం ఏళ్లుగా రెడ్డి సామాజికవర్గం ఉద్యమాలు చేసినా గత పాలకులు పట్టించుకోలేదని రెడ్డి సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కనమెని చక్రధర్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 17 సామాజికవర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, పేదలకు న్యాయం చేశారన్నారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం కలిసి ప్రత్యేక ధన్యావాదాలు తెలిపి సన్మానించారు. రెడ్డి సామాజికవర్గంతో పాటు ఇతర 16 సామాజికవర్గాల వారికి వైద్యం, విద్య, ఉద్యోగాలు అందుతాయన్నారు

అయ్యప్ప ఆలయంలో 'విప్' పూజలు

రుద్రంగి(వేములవాడ): మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అయ్యప్పస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

డ్రా ద్వారా ప్రవేశాలకు ఎంపిక

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్ బేగంపేటలోని పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలోంచి శనివారం లాటరీ ద్వారా అధికారులు ఎంపిక చేశారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పర్యవేక్షణలో విద్యార్థులు తల్లిదండ్రులు సమక్షంలో కలెక్టరేట్‌లో డ్రా తీశారు. అనంతరం గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన మెద చిన్మయి డ్రాలో ప్రవేశార్హత సాధించింది. వెయిటింగ్ లిస్ట్‌లో ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందినపల్లె శివాని, వేములవాడ రూరల్ మండలం వెంకట్రామ్‌పల్లికి చెందిన ఆవునూరి తనుష్ ఉన్నారు. జిల్లా విద్యాధికారి రమేశ్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హామీల అమలుకు ప్రభుత్వం కృషి



చందుర్తి: లింగంపేటలో సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ, నాయకులు



ముస్తాబాద్ : పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి

చందుర్తి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్ అన్నారు. మండలంలోని లింగంపేట, కట్టలింగంపేట, మూడపల్లి, గోస్కుల పల్లెలో సీసీరోడ్లు, బోరు బావులకు, కమ్యూనిటీ భవనాల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో అన్నిగ్రామాల్లో అభివృద్ధి పనులను చేపడుతామన్నారు. జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేశ్, నాయకులు బానాల రవీందర్‌రెడ్డి, ఆవారి రమేశ్, అంజనీరావు, బండారి శేఖర్, ఏసుదాసు, ప్రసాద్, రాజు, గణేశ్, ఆనంద్, రవి తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో ఎంపీ బండి సంజయ్ నిధులతో సీసీరోడ్ల నిర్మాణానికి వైస్‌ఎంపీపీ మందాల అబ్రహం, మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, బీజేపీ నాయకులు భూమిపూజ చేశారు. ఎంపీటీసీ పులి రేణుక, సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, జిల్లా నాయకులు సిరికొండ శ్రీనివాస్, సిర్రం తిరుపతి, గుగ్గిళ్ల సాగర్, మటకం మల్లేశం, తిరుపతి, మేడిశెట్టి శ్రీమరి, మర్రి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలో పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తెలిపారు. ముస్తాబాద్, గూడూరు, చీకోడు, నామాపూర్‌లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, బోరుమోటార్ పనులకు భూమిపూజ చేశామన్నారు. ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, డీసీసీ ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ కొండల్‌రెడ్డి, తిరుపతి, నర్సింలు, తలారి నర్సింలు, ప్రశాంత్, నరేశ్, విజయ్, భాను, రమేశ్, రాజిరెడ్డి, రాంరెడ్డి, అనిల్, బాల్‌రెడ్డి, కొండయ్య, మధు, నల్లచారి తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని అంకిరెడ్డిపల్లెలో ఎంపీటీసీ రాగుల రాజిరెడ్డి రూ.15 లక్షల నిధులతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. రూ.12 లక్షలు ఉపాధిహామీ నిధులు, సీసీరోడ్లు, రూ.3 లక్షల ఎంపీల్యాడ్స్ నిధులతో యాదవ సంఘ నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. నాయకులు నందగిరి మధు, రాములు, విఠల్ రెడ్డి, రాజు, గోపాల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పోచయ్య, బాల్ రెడ్డి, విజయ్, బాలమల్లు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని మద్దిమల్ల, శాంతినగర్‌లో ప్రజాప్రతినిధులు బోరు బావులను ప్రారంభించారు. శాంతినగర్‌లో జెడ్పీటీసీ నిధులతో, మద్దిమల్లలో ఎంపీ నిధులతో రెండు బోరు బావులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పదేళ్లు అవినీతి అక్రమాలు

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ డబ్బుతో గెలవాలని చూస్తోంది
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లు అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. కాళేశ్వరంలో దోచుకున్న డబ్బుతో పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలని చూస్తుందన్నారు. కేసీఆర్‌కు సన్నిహితుడైన వినోద్ కుమార్‌ను గెలిపించుకునేందుకు కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో రూ.6.67కోట్లు దాచిపెట్టారన్నారు. వేములవాడలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ములాఖత్ కాలేదని నమ్మించేందుకు కవితను అరెస్ట్ చేసి డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. నరేంద్రమోదీ మ్యాజిక్ పనిచేయదని, రాష్ట్రంలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులు ప్లాన్ చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు కాలం చెల్లించదని, ఆ పార్టీలో మిగిలేది కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితలేనన్నారు.

నేత కార్మికులకు ఉపాధి కల్పించాలి

- టెక్స్‌టైల్ శాఖ డైరెక్టర్ వర్షిణికి వినతి



సిరిసిల్లటౌన్: వస్త్రపరిశ్రమ సంక్షోభంతో రోడ్డున పడిన సిరిసిల్ల నేతకార్మికులకు వెంటనే ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. ఈమేరకు కలెక్టర్‌లో టెక్స్‌టైల్‌శాఖ డైరెక్టర్ అలుగు వర్షిణితోపాటు కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమిని కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. వస్త్రపరిశ్రమ బంద్ నేపథ్యంలో నేతకార్మికులకు రూ.10వేలు తక్షణసాయం అందించాలని, బతుకమ్మ చీరలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని, కార్మికులకు రావాల్సిన సబ్సిడీ యారన్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ కోరారు. నాయకులు మూశం రమేశ్, నక్క దేవదాసు తదితరులున్నారు.

108లో ప్రసవం



ఎల్లారెడ్డిపేట: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళకు 108 సిబ్బంది పురుడుపోయగా.. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో శనివారం జరిగింది. పెద్దగంట గంగ(26) అనే గర్భిణికి శనివారం పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా.. ఈఎంటీ సతీశ్, పైలట్ అనిల్‌కుమార్‌ను గర్భిణిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువకావడంతో అంబులెన్స్‌లో ప్రసవం చేశారు. తల్లీబిడ్డను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మహిళా సంఘం సభ్యుల ఖాతాల నుంచి నగదు మాయం

వేములవాడరూరల్: మహిళాసంఘం తరపున బ్యాంకులో తీసుకున్న రుణాన్ని నెలనెలా చెల్లించినా సభ్యుల సొంతఖాతా నుంచి బ్యాంకు అధికారులు డబ్బులు కట్ చేయడంతో సభ్యులు ఖంగుతిన్నారు. ఈ విషయంపై బ్యాంకు అధికారులు, సంబంధిత అధికారి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడ మండలం మల్లారం గ్రామంలోని మహిళా సంఘంలో జరిగినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. వేములవాడలోని ఆంధ్రాబ్యాంకులో సంఘం సభ్యులు సంఘం పేరుమీద రుణం తీసుకున్నారు. తీసుకున్న రుణాన్ని నెలనెలా సభ్యులు చెల్లించినా సంఘం అధ్యక్షురాలు డబ్బులు చెల్లించనట్లు తెలిసింది. దీనిపై అదే బ్యాంకులో ఖాతా ఉన్న సభ్యుల ఖాతా నుంచి బ్యాంకు అధికారులు డబ్బులు కట్ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై బ్యాంకు అధికారులకు తెలపగా తీసుకున్న డబ్బులు చెల్లించకపోవడంతోనే మీ ఖాతానుంచి డబ్బులు కట్ అయినట్లు తెలిపారు. దీనిపై సభ్యులు సంబంధిత సంఘం లీడర్‌ను నిలదీయగా అసలు విషయం బయటకొచ్చింది.

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా శిక్షణ

ముస్తాబాద్: ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని జెడ్పీటీసీ గుండం నర్సయ్య అన్నారు. పాఠశాలలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలతో ఏర్పాటు చేసే కంప్యూటర్ ల్యాబ్ పనులను ప్రారంభించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా ఇక్కడ విద్యార్థులకు కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తారన్నారు. ఎంపీటీసీ సొల్లలలిత, హెచ్‌ఎం మద్దికుంట లక్ష్మణ్, మాజీ సర్పంచ్ బద్ది కల్యాణి, మిర్యాల్‌కార్ శ్రీనివాస్, భాను, క్రాంతి, లక్ష్మారెడ్డి, రాజు, రాంరెడ్డి, నవీన్, నారాయణ, వెంకటేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రాజేశ్

బోయినపల్లి(చొప్పదండి): జగిత్యాలలో ఈనెల 18న జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ చొప్పదండి నియోజకవర్గ ప్రభారి రాజేశ్ పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు ఎడపల్లి పర్శరాం, సుంకపాక ప్రభు, క్యాతం తిరుపతిరెడ్డి, బోగోజి గంగాధర్‌చారి, కొసుకటి హరీశ్, బొంగాని అశోక్, రెడ్డవేని రాజు, గంగయ్య తదితరులున్నారు.

గల్ఫ్ బాధితునికి ఆర్థిక సాయం

- ఆర్థికసాయం అందించిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

సాక్షి స్పందన



శేఖర్ కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని బండలింగంపల్లికి చెందిన కొండాపురం శేఖర్ అనే వ్యక్తి అప్పులు చేసి గల్ఫ్ వెళ్లాడు. అప్పులు తీరకుండానే అక్కడే అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో శరీరం స్పర్శ కోల్పోవడంతో పనులు చేయలేక అప్పులతో స్వగ్రామం చేరాడు. ఆస్పత్రుల్లో చూపించగా.. ఖరీదైన వైద్యం అందించాలని వైద్యులు సూచించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శేఖర్‌కు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని తల్లి గంగవ్వ వేడుకుంది. దీంతో స్పందించిన మండలంలోని సింగారం గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ వారు శేఖర్ వైద్య ఖర్చుల కోసం రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. మరింత మంది ముందుకొచ్చి యువకుడి చికిత్సకు ఆర్థిక సాయం అందించాలని సొసైటీ ప్రతినిధులు కోరారు.

రెడ్డి యూత్ రూ.10వేల సాయం

శేఖర్ పరిస్థితి తెలుసుకున్న గ్రామానికి చెందిన కొండే రెడ్డి యూత్ సభ్యులు రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం చేయాలని యూత్ సభ్యులు కోరారు.

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

గంభీరావుపేట: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా నాయకుడు కొండూరు గాంధీబాబు అన్నారు. మండలంలోని గజసింగవరం, రాజేశ్వర్ రావునగర్, మల్లుపల్లి, నాగంపేట, దమ్మన్నపేట, జగదాంబతండా, గోరింటాల గ్రామాల్లో నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

ఎల్లారెడ్డిపేట: మండల నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌గౌడ్‌ను మండలంలోని వివిధ కులసంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. సీఐ మాట్లాడుతూ..మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కులసంఘాల నాయకులు సహకరించాలన్నారు. వివిధ కుల సంఘాల మండల అధ్యక్షులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గుండాడి వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ముస్తాబాద్: ఇసుక రవాణాలో నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని శ్రీకృష్ణయాదవ భవనంలో ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లకు ఇసుక రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ పనుల కోసం తీసుకున్న ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. రెవెన్యూ అధికారులు జారీచేసిన టోకెన్లపై నిర్ణీత సమయంలోనే ఇసుకను తరలించాలని, సమయం దాటితే సీజ్ చేస్తామన్నారు. ట్రాక్టర్లకు అనుమతులు ఉండాలని, డ్రైవర్లకు లైసెన్స్ ఉండాలన్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి, తదితరులున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

గంభీరావుపేట: మండలంలోని గోరింటాలలో ఈజీఎస్ నిధులు రూ.16లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రారంభించారు.

మిగులు పనులు..

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో మహిళా సంఘం భవన నిర్మాణంలో మిగులు పనులను ఎంపీ బండి సంజయ్ కోటా నిధుల ద్వారా ప్రారంభించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ తెలిపారు. రూ.3లక్షల ఎంపీ ల్యాండ్స్‌తో భవనం ప్రహరీ పనులు చేపట్టామన్నారు. మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గౌతం రావు, ఎంపీటీసీ బాలకిషన్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

తంగళ్లపల్లి: పాపయ్యపల్లెలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎంపీ బండి సంజయ్ ఎంపీల్యాడ్స్ నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీధర్ రావు పాపయ్యపల్లె గ్రామ నాయకులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. బీజేపీ నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎల్లారెడ్డిపేట: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య అన్నారు. రాచర్ల బొప్పాపూర్‌లో రూ.15 లక్షలతో సీసీరోడ్లు, కల్వర్టుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సహకారంతో మండలానికి ప్రత్యేక నిధులు రూ.1.60 కోట్లు మంజూరయ్యాయన్నారు.